# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 06-02-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది.**
2. **ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో నిర్వహించే"మీ భూమి-మీ హక్కు కార్యక్రమం"లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.**
3. **తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ రోజు శంకుస్థాపన చేయనున్నారు.**
4. **పామాయిల్ సాగు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా మారిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.**

-----------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" 9 వ సంచిక ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది.

జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను

ప్రధానమంత్రి ఈ కార్యక్రమంలో తెలియజేస్తారు. ఢిల్లీతో పాటు, తమిళనాడులోని కోయంబత్తూరు, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, గుజరాత్‌లోని దేవ్ మొగ్రా, అస్సాంలోని గువహటికి చెందిన విద్యార్థులతో ప్రధానమంత్రి ఈ కార్యక్రమంలో సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానెల్, ఆకాశవాణి, దూరదర్శన్ లతో పాటు విద్యా మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాలలోనూ ప్రసారం అవుతుంది.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని  కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు. జిల్లాలోని  కలుగట్లలో జరిగే "మీ భూమి-మీ హక్కు కార్యక్రమం"లో భాగంగా నిర్వహించే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పాల్గొంటారు.ఈ ఉదయం క్యాంప్ ఆఫీస్ నుంచి బయలుదేరి కలుగట్ల చేరుకుంటారు. గ్రామసభలో పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడతారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి మధ్యాహ్నం  రైతులతో ముఖాముఖి చర్చిస్తారని అధికారులు తెలిపారు.

ఇక అమరావతిలోని నేలపాడు వద్ద పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన "నీరు-ప్రగతి, జల హారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ప్రతీ ఎకరాకు సాగు నీరు అందేలా సాగునీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 27 సెకన్లు

----------------------

కార్మికులకు ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కార్మికశాఖపై  అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆ ధునిక నైపుణ్య శిక్షణ ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ విదేశాల్లోని ఉపాధి అవకాశాలను దక్కించుకుని ఆదాయాన్ని ఆర్జించేలా చూడాలని సూచించారు. జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల సమాచారాన్ని రూపొందించాలని..  నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటా బేస్ ను అనుసంధానించటంతో పాటు కార్మికులు  వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

----------------------

తెలంగాణ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి  ఈ రోజు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలన్నింటిలో వ్యవసాయ కళాశాలల స్థాపన నిర్ణయంలో భాగంగా ప్రభుత్వం  ఈ విద్యాసంవత్సరం నుంచి సూర్యాపేట, కొడంగల్‌తో పాటు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి కొత్త కళాశాలలను ప్రకటించింది. డిచ్‌పల్లి కళాశాల కోసం సుద్దపల్లి-నడిపల్లి గ్రామాల పరిధిలోని తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 120 ఎకరాలను కేటాయించి. 123.74 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది.

----------------------

ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను 100 శాతం వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారుల్ని ఆదేశించారు. ఎస్సి సబ్ ప్లాన్ నిధులు, ఎస్సీ అట్రాసిటీ బాధితులకు పరిహారం, నూతన వసతి గృహాల నిర్మాణం వంటి అంశాలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని ఆదేశించారు. అట్రాసిటీ బాధితులకు అందాల్సిన పరిహారం నిధులను సకాలంలో విడుదల చేసి న్యాయం చేయాలని మంత్రి సూచించారు.

----------------------

పామాయిల్ సాగు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా మారిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పామాయిల్ పంట సాగుకు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో అధిక ధర లభించడం పట్ల రైతులు .విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని చెప్పారు. జాతీయ నూనె గింజల మిషన్ కింద రైతులకు ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, పరికరాలపై భారీ రాయితీలు అందిస్తూ ఆయిల్ పామ్‌ను రాష్ట్రంలో భవిష్యత్తు పంటగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

----------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా జి. ఎర్రంపాలెం గ్రామ పరిధిలో పులి సంచారంపై ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు కొనసాగుతోందని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. జి. ఎర్రంపాలెం, కేసవరం, సర్వరాయ షుగర్స్ ప్రాంతాల సమీపంలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులి సంచారం కనిపించినా, పులి అడుగుజాడలు గమనించినా వెంటనే అటవీ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరుతూ,

వాయిస్ 21 సెకన్లు

-----------------------

తెలంగాణలో గ్రూప్-1 ఉద్యోగ నియామకాలకు సంబంధించిన మెయిన్స్ పరీక్షల ఫలితాలను కొట్టేస్తూ సింగిల్ జడ్జి గత ఏడాది సెప్టెంబర్ 9న ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ .. హైకోర్టు తీర్పును వెలువరించింది. మాస్ కాపీయింగ్, ప్రశ్న పత్రాల లీకేజీ వంటి స్పష్టమైన ఆధారాల్లేకుండా ఏకపక్షంగా పరీక్ష ఫలితాలు రద్దు చేయడం సరికాదని తెలిపింది. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో విజయం సాధించామన్నారు. గ్రూప్-1 ఉద్యోగాలు పొందిన 563 మంది అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత తొలిసారి గ్రూప్-1 అధికారులు నియమితులయ్యారని, వారంతా రాష్ట్ర పునర్నిర్మాణానికి పునరంకితం కావాలని కోరారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ తెల్లవారుజామున, రాత్రివేళల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. రెండు రాష్ట్రాల్లోనూ పొడి వాతావరణం నెలకొని, కొన్ని ప్రాంతాల్లో పొగమంచు ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణా కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్లో 11 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

----------------------

స్వాతంత్ర్య సమరయోధులు, సరిహద్దు గాంధీగా పేరు గాంచిన భారతరత్న ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతి ఈరోజు. స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీతో కలిసి పాల్గొన్న ఆయన... 1890 ఫిబ్రవరి 6వ తేదీన అప్పటి బ్రిటీష్ ఇండియాలోని వాయువ్య సరిహద్దు రాష్ట్రం ఉస్మాన్ జెయిలో జన్మించారు. రెడ్ షర్ట్ ఎర్రచొక్కాల ఉద్యమం ప్రారంభించిన గఫార్ ఖాన్ భారత విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. సరిహద్దు గాంధీగా పేరుగాంచిన ఆయన.. భారతరత్నను అందుకున్న తొలి భారతీయేతరులు కావడం విశేషం.

----------------------